క్లుప్తంగా

జీవన జ్యోతి పథకంపై అవగాహన

సీతానగరం: యూనియన్ బ్యాంక్ మిర్తిపాడు శాఖ ఆధ్వర్యంలో ములకల్లంకలో గురువారం ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకంపై అవగాహన శిబిరం నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ రమ్య ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ ఎం.సుధీర్ బాబు సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ బీమా వల్ల కలిగే లాభాలను వివరించారు. బిజినెస్ కరస్పాండెంట్ వి.ఆంజనేయులు, వెంకటలక్ష్మి, పి.రాంబాబు, ఎస్.సురేష్ తదితరులు శిబిరంలో 42 మందిని ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకంలో చేర్చారు.

108లో గర్భిణి ప్రసవం



తల్లీబిడ్డలతో 108 అంబులెన్స్ సిబ్బంది

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన దొండపాటి ప్రశాంతి 108 అంబులెన్స్‌లో గురువారం పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వేమగిరి నుంచి పుట్టింటికి బొబ్బిల్లంక వచ్చిన ప్రశాంతికి పురిటి నొప్పులు వస్తున్నాయని ఆశా వర్కర్ వెంకట రమణ ఉదయం 7.32 గంటలకు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. ఉదయం 7.52 గంటలకు బొబ్బిల్లంకకు చేరుకున్న అంబులెన్స్.. ప్రశాంతికి ఎక్కించుకుని కొద్ది దూరం వెళ్లగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప, ఆశా వర్కర్ వెంకట రమణ సహకారంతో ఈఎంటీ ముత్యం శ్రీనివాస్, పైలట్ మణికుమార్ ప్రసవం చేశారు. మెరుగైన వైద్యసేవలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉజ్వల యోజనను సద్వినియోగం చేసుకోవాలి

పెదపూడి: పేదల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి అన్నారు. జి.మామిడాడ శివారు లక్ష్మీనరసాపురంలో 40 మంది లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో మంజూరైన గ్యాస్ కనెక్షన్లను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకటపద్మావతి, బీజేపీ జిల్లా కోకన్వీనర్ మేడపాటి హరినారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాపవరంలో మెకానిక్ షెడ్డు దగ్ధం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరానికి చెందిన కనుబొజ్జి సూర్యచంద్రం మెకానిక్ షెడ్డు గురువారం మధ్యాహ్నం దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. సూర్యచంద్రం మెకానిక్ షెడ్డులో పనులు చేసుకుని మధ్యాహ్నం భోజనానికి ఇంటికెళ్లారు. మరో మెకానిక్ షెడ్డు బయట ఉన్నాడు. ఆ సమయంలో షెడ్డు వెనుక భాగం నుంచి మంటలు రేగాయి. గుర్తించిన స్థానికులు ఈ విషయాన్ని సూర్యచంద్రానికి ఫోన్ చేసి చెప్పారు. వెంటనే స్థానిక యువకులతో కలిసి మంటలను అదుపు చేశారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది కూడా వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే షెడ్డులోని ఆయిల్ డబ్బాలు, ఇతర సామగ్రి కాలిపోయింది. వాటి విలువ రూ.1,50,000 లు ఉంటుందని సూర్యచంద్రం తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

కాకినాడ జీజీహెచ్‌కు 500 పీపీఈ కిట్ల అందజేత



కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకు పీపీఈ కిట్లు అందజేస్తున్న భామిరెడ్డి

పెదపూడి: కోవిడ్ మహమ్మారి మరోసారి వ్యాపిస్తున్న నేపథ్యంలో జి.మామిడాడ లయన్స్ క్లబ్ 500 పీపీఈ (పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్) కిట్లను సమకూర్చింది. వాటిని కాకినాడలో జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకు క్లబ్ సీనియర్ ప్రతినిధి భామిరెడ్డి చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో జి.మామిడాడ క్లబ్ ప్రతినిధి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మండ రాజారెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకంపై అవగాహన

రాజానగరం: ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న తమకు పారలు, గునపాలను ఇప్పించాలని ఆ పథకానికి సంబంధించిన కూలీలు విజ్ఞప్తి చేశారు. సామాజిక తనిఖీ, సాంస్కృతిక బృందం ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్)పై మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని పాత తుంగపాడులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం, చట్టం, కూలీలకు కలుగుతున్న ప్రయోజనాలు, సమకూరుస్తున్న సదుపాయాలను సామాజిక తనిఖీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామారావు వివరించారు. ఈ సందర్భంగా కొంతమంది కూలీలు పైవిధంగా అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం, ఏపీడీ రాంప్రసాద్, ఏపీఓ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గోకవరం సీహెచ్‌సీకి మహర్దశ

- రూ.5.65 కోట్ల ఖర్చుతో 30 పడకల ఆసుపత్రి
- నేడు నూతన భవనం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్



గోకవరంలో పాత ప్రభుత్వాస్పత్రి భవనం

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోంది. దీనిలో భాగంగా గోకవరం సీహెచ్‌సీకి అధునాతన వసతులతో 30 పడకల ఆస్పత్రి భవనం అందుబాటులోకి వచ్చింది. ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న గోకవరం ప్రభుత్వాస్పత్రిలో అరకొర వసతులు ఉండేవి. ప్రతి రోజు ఈ ఆస్పత్రికి వందకుపైగా ఓపీ ఉండేది. వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించేందుకు సరైన వసతుల్లేక ఇబ్బంది పడేవారు. ఇరుకు గదుల్లోనే డాక్టర్లు సేవలందించాల్సిన పరిస్థితి నెలకొంది. 2012లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఇందిరమ్మ పల్లెబాట కార్యక్రమంలో భాగంగా గోకవరం ప్రభుత్వాస్పత్రిని సందర్శించి 100 పడకల ఆస్పత్రి భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తదనంతరం కార్యాచరణ చేపట్టకపోవడంతో హామీ అమలు కాలేదు. తదనంతరం వచ్చిన టీడీపీ సైతం ఆస్పత్రి గురించి పట్టించుకోకపోవడంతో అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. పదేళ్ల క్రితం వరకు పది పడకల ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ని అప్‌గ్రేడ్ చేసి 30 పడకల స్థాయికి పెంచారు. కానీ అందుకు తగ్గట్టుగా భవనం లేకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీహెచ్‌సీకి మహర్దశ పట్టింది. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చొరవతో 2020, అక్టోబర్ నెలలో 30 పడకల ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేశారు. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించారు. ఆరు నెలల క్రితం 50 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు ప్రతిపాదనలను ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం భవనం పనులు దాదాపు పూర్తి కాగా శుక్రవారం జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

ప్రసూతి సేవల్లో ప్రథమ స్థానం

ప్రసూతి వైద్య సేవల్లో గోకవరం సీహెచ్‌సీ ప్రథమ స్థానంలో ఉంది. ఇక్కడ ప్రభుత్వాస్పత్రిలో నెలకు 30 డెలివరీలు లక్ష్యంకాగా లక్ష్యానికి మించి ప్రతి నెలా 70 డెలివరీలు చేస్తున్నారు. ఈ విధంగా జూన్ నెలలో అందించిన సేవలకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇతర వైద్య సేవలు, అరుదైన శస్త్ర చికిత్సలను సైతం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రోజు ఓపీ 200 నుంచి 300 వరకు ఉండగా నూతన భవనం అందుబాటులోకి వస్తే మరింత పెరిగే అవకాశం ఉంది.

పేదల వైద్యానికి పెద్దపీట



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చింది. దశాబ్దాల కాలంగా కలగా ఉన్న నూతన భవనం నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టింది. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చొరవతో పనులు నాణ్యతతో చురుగ్గా జరిగాయి. భవనం అందుబాటులోకి వస్తే మండల ప్రజలతో పాటు ఏజెన్సీ మండలాల ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

– కర్రి సూరారెడ్డి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు, గోకవరం

ఓపీ పెరిగే అవకాశం ఉంది



గోకవరం సీహెచ్‌సీ నూతన భవనం అందుబాటులోకి వస్తే ఓపీ పెరుగుతుంది. 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయితే మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం జనరల్ ఫిజీషియన్, సర్జన్, గైనిక్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వారానికి ఒకసారి ఆర్థో సేవలు అందుతున్నాయి. పాత భవనం స్థానంలో నూతన భవనం వినియోగంలోకి వస్తే వసతి కొరత తీరుతుంది.

– డాక్టర్ వనజాకుమారి, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, గోకవరం

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: రాజానగరం, కానవరాల్లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. రాజానగరం, సూర్యారావుపేట, కానవరం, ఫరిజల్లిపేట, వెలుగుబంద, చక్రద్వారబంధం, చంద్రిక అపార్టుమెంట్స్, బ్రిడ్జి కౌంటీ, జీఎస్ఎల్ వైద్య కళాశాల క్యాంపస్, గైట్ ఇంజినీరింగ్ కాలేజ్ క్యాంపస్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని వినియోగదార్లకు, వ్యవసాయ అవసరాలకు అంతరాయం కలుగుతుంది.

అనపర్తి: అనపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని రాజమహేంద్రవరం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొప్పవరం, లక్ష్మీనరసాపురం, మహేంద్రవాడ గ్రామాల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

సారా కేసులో ఇద్దరి అరెస్టు

రంగంపేట: సారా కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం రాత్రి ఆమె తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పెద్ద దొడ్డిగుంట, సింగంపల్లి గ్రామాల్లో దాడులు నిర్వహించగా దొడ్డిగుంట గ్రామానికి చెందిన దంగేటి దుర్గ నుంచి 12 లీటర్ల సారా, సింగంపల్లి గ్రామానికి చెందిన తుట్టా సత్యనారాయణ నుంచి 15 లీటర్ల సారాతో అరెస్టు చేశామన్నారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. దుర్గకు సారా సరఫరా చేసిన దొడ్డిగుంట గ్రామానికి చెందిన బక్క నాగేంద్రపై కేసు నమోదు చేశామని చెప్పారు.

సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందం



వేంద్రలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- వేంద్రలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందం వెల్లివిరుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన వేంద్ర గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీంతో మండలంలోని గ్రామాలన్నింటా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మ ఒడి, రైతు భరోసా, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఫ్యామిలీ ఫిజీషియన్ తదితర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తూ ముఖ్యమంత్రి జగన్ ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, పైన సొసైటీ డైరెక్టర్ పేపకాయల సూర్యనారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నర్ల సాంబమూర్తి, రొక్కాల సత్తిబాబు, కోసూరి సూరిబాబు, కోసూరి సతీష్, మందపల్లి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- నియోజకవర్గంలో దిగ్విజయంగా పూర్తయిన గడప గడపకూ..
- 239 రోజుల పాటు 59 గ్రామాల్లోని 79 సచివాలయాల్లో పర్యటన



వేంద్రలో కేక్ కట్ చేసి ముక్తేశ్వరరావుకు తినిపిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది మన వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వేంద్రలో గురువారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలో ముగింపు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. భారీ బాణసంచా, తీన్‌మార్ డప్పులు, పార్టీ శ్రేణులు, ప్రజల ఆనందోత్సాహాల నడుమ ఎమ్మెల్యే కేక్ కట్ చేసి ముందుగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావుకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అనపర్తి మండలం కొత్తూరు గ్రామంలో గతేడాది మే 10వ తేదీన అట్టహాసంగా ప్రారంభించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలు పూర్తి చేసి, చివరిగా పెదపూడి మండలం వేంద్రలో ముగించామన్నారు. నియోజకవర్గంలో 239 రోజుల పాటు 79 సచివాలయాలు, 59 గ్రామాల్లో తిరిగి 98 వేల కుటుంబాలను కలిసి ప్రభుత్వ లబ్ధిని వివరించామన్నారు. ఏ గడపకు వెళ్లినా ప్రజల నుంచి అపూర్వ స్వాగతం, ఆదరణ లభించాయన్నారు. కార్యక్రమంలో తనను ఎంతో ఆదరించి అభిమానించి స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మండ రాజారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు, సర్పంచులు సుందరపల్లి ప్రమీల, డి.మీనాక్షి, కుడిపూడి మాధవీలత, కేవీవీ సత్యనారాయణ, రాజుపాలెం ఉప సర్పంచ్ నాగుమళ్ల వీరభద్రరావు, ఎంపీటీసీ సభ్యులు కర్రి శ్రీవెంకటరెడ్డి, చంద్రాళ్ల పార్వతి, సాంబత్తుల చంటి తదితరులు పాల్గొన్నారు.

సొంత ప్రయోజనాలతో పార్టీని వీడే వారితో నష్టం ఉండదు

గోకవరం: సొంత ప్రయోజనాల కోసం వైఎస్సార్ సీపీని వీడే వారితో పార్టీకి ఎటువంటి నష్టం ఉండదని ఆ పార్టీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ తదితరులు అన్నారు. గోకవరంలో స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో గురువారం ఆ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు వైఎస్సార్ సీపీకి, పదవికి రాజీనామా చేసే క్రమంలో పార్టీపై, స్థానిక నాయకులపై విమర్శలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. 2019లో వైఎస్సార్ సీపీ గెలుపొందిన తరువాత టీడీపీ నుంచి పార్టీలోకి వచ్చిన సత్తిబాబుకి ఎమ్మెల్యే చంటిబాబు సొసైటీ చైర్మన్ పదవిని కట్టబెట్టారన్నారు. మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయిన వారి వలన పార్టీకి ఎటువంటి నష్టం ఉండదన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్టు ఎవరికి ఇచ్చినా శక్తివంచన లేకుండా పని చేసి నియోజకవర్గంలో హ్యాట్రిక్ సాధిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, పాటి రాంబాబు, కర్రి సూరారెడ్డి, నరాలశెట్టి నర్సయ్య, రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

జీసస్ ప్రజలందరికీ ఆదర్శనీయుడు

రంగంపేట: జీసస్ ప్రజలందరికీ ఆదర్శనీయుడని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్ అన్నారు. మండల పరిధిలోని వడిశలేరు అరుంధతీపేటలో జీఏఎంసీ బేతస్థ చర్చిలో పాస్టర్ ఎస్.చక్రవర్తి ఆధ్వర్యంలో గురువారం జరిగిన గ్రాండ్ క్రిస్మస్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ మంచి చేయాలనే తలంపు ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి జరుగుతుందన్నారు. సంగీత దర్శకుడు ఏఆర్ స్టీవ్స్, పాస్టర్లు జార్జ్, అవినాష్‌లు శాంతి సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, ఆళ్ల గోవిందు, నలమాటి భీముడు, పాస్టర్లు పాల్గొన్నారు.

క్రీస్తు జననంతో లోకానికి వెలుగు

మధురపూడి: ఏసుక్రీస్తు జననంతో లోకానికి కొత్త వెలుగు వచ్చిందని బైబిల్ మిషన్ ప్రెసిడెంట్, బిషప్ డాక్టర్ నక్కా విజయరాజు అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలోని కంటే సత్తిబాబు ఇంటి వద్ద గురువారం రాత్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బిషప్ విజయ రాజు మాట్లాడుతూ ప్రార్థనల ద్వారా క్రీస్తుకు స్వాగతం పలకాలన్నారు. కంటే సత్తిబాబు, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు కంటే వినయ్ తేజ, జెడ్పీటీసీ కర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- ఫరిజల్లిపేటలో 186 మందికి పట్టాల పంపిణీ



పేదలకు స్థల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు

రాజానగరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలను మంజూరు చేయడంతో పాటు, ఆ స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వపరంగా రుణాలు కూడా ఇప్పిస్తామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని ఫరిజల్లిపేటలో 186 మంది పేదలకు గురువారం నివాస స్థల పట్టాలను సతీమణి డాక్టర్ రాజశ్రీతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో ఒక్క పేదోడికి సెంటు భూమి కూడా ఇవ్వలేదన్నారు. జగనన్న సీఎం అయిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 31.75 లక్షల మందికి నివాస స్థలాలు పంపిణీ చేసి, రికార్డు సృష్టించారన్నారు. ఆ స్థలాలలో ఇళ్లు కట్టుకునేందుకు రుణాలు కూడా మంజూరు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా స్థలాలలో కాలనీలే కాకుండా ఏకంగా గ్రామాలే ఆవిర్భవిస్తున్నాయన్నారు. పేదల జీవితాలలో వెలుగులు తీసుకురావాలనే తలంపుతో పనిచేస్తున్న జగన్ సర్కారు మరోసారి అధికారంలోకి రావాలన్నారు. అప్పుడే నవరత్నాలు వంటి సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. సర్పంచ్ ఉండమట్ల సత్యవతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, మాజీ సర్పంచ్ ఉండమట్ల రాజబాబు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, కోలపాటి వెంకన్న, ప్రగడ చక్రి, మన్యం వీర వెంకట్రావు, గొల్లపల్లి వీరబాబు, పరిమి విజయ్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో ట్యాబ్‌ల పంపిణీ



చంద్రేడు హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పెదపూడి: పేద కుటుంబాల్లో విద్యా కాంతులు నింపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి అన్నారు. కాండ్రేగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యా వసతి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక వంటి పథకాలు అమలు చేయలేదన్నారు. అలాంటి మనసున్న వ్యక్తికి ప్రజలందరూ అండగా ఉండి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ, సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంఈవో కె.స్వామి నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు తదితరులు విచ్చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.వీరభద్రరావు మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న 72 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు వచ్చాయన్నారు.

సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

రంగంపేట: సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని చంద్రేడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ప్రధానోపాధ్యాయుడు గంటా రమణబాబు అధ్యక్షతన జరిగిన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ కంటిపూడి శేషారత్నం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, మండల జేఏసీ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, జాస్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని కాపవరం ఉన్నత పాఠశాలలో 26 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ గురువారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ మార్శెళ్ల భీష్ముడు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ కర్రి గంగరాజు, ఎంఈవో సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



బాధితులకు సాయం అందజేస్తున్న నాయకులు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధి నాగరత్నం కాలనీలో ఈనెల 25న జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన దాసరి సత్యనారాయణ, దాసరి వెంకన్న కుటుంబాలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేయూత నిచ్చారు. ఆయన పంపించిన రూ.10 వేలు, 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు, వంట సామగ్రిని గురువారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు తదితరులు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్మిరిశెట్టి వెంకటేశ్వరరావు, చిర్ల పోశియ్య, మట్ట శ్రీనువాస్, ద్వారంపూడి రామాకృష్ణ, కోలా శ్రీను, ఆర్ఎంపీ రాజు పాల్గొన్నారు.

రమణ మహర్షి జయంతి

గోకవరం: రమణమహర్షి జయంతిని గురువారం స్థానిక పాతబస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. పాతబస్టాండ్ వ్యాపారస్తులు సండూరి శ్రీను, పోతుల శ్రీనుల ఆధ్వర్యంలో రమణమహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో సుమారు 2 వేల మంది పాల్గొన్నారు.

కోదండరాముడిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: జి.మామిడాడలో కోదండ రామాలయం నిర్మించి 134 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయంలో సహస్ర కలశాభిషేక పూర్వక శాంతి కల్యాణ మహోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండితులు ఎ.రఘురామాచార్యులు, ఆర్.వెంకట కూర్మ రంగనాథాచార్యులు, ఆర్‌సీహెచ్ వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. పూజల్లో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ద్వారంపూడి మురళీకృష్ణ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శ

రాజానగరం: నియోజకవర్గంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా గురువారం పరామర్శించారు. రాజానగరం మండలం పాత తుంగపాడులో తండ్రిని కోల్పోయిన బొచ్చు స్వామినాయుడిని, శ్రీకృష్ణపట్నంలో భార్య వియోగంతో బాధపడుతున్న మందారపు సత్యనారాయణను పరామర్శించారు. కోరుకొండ మండలం జంబూపటాన్నికి చెందిన తేలు సూర్యచంద్రరావు మరణంతో ఆవేదనలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఉల్లి బుజ్జిని, శ్రీరంగపట్నంలో కోయిదాల బుల్లబ్బాయి మృతితో విచారంలో ఉన్న అతడి కుమారుడు నానాజీని ఓదార్చారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో సబ్బెళ్ల రామారెడ్డి, సుచిత్ర దంపతులు తమ కుమారుడు స్వాతిక్ శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డిలు గురువారం ప్రారంభించారు. శిబిరంలో కడియం సాహితీ ప్రాథమిక కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 150 మంది రోగులను పరీక్షించి 40 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్తి శ్రీనివాస్‌రెడ్డి, పడాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.